
ఇటీవల బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే విజయధరణిని మోదీకి పరిచయం చేస్తున్న పొంగులేటి సుధాకర్‌రెడ్డి



మోదీకి జ్ఞాపికను బహూకరిస్తున్న బీజేపీ నేతలు

డీఎంకే, కాంగ్రెస్‌లను

తరిమికొడదాం

తిరునెల్వేలి సభలో ప్రధాని మోదీ పిలుపు

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమాలకు మారుపేరైన డీఎంకే, కాంగ్రెస్ పార్టీలను తరిమికొట్టాల్సిన అవసరముందని, ఇకపై డీఎంకే ఎక్కడా కనిపించదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. తిరునల్వేలి పాళయంకోట వద్ద బుధవారం ఉదయం బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటైన బహిరంగ సభలో ఆయన ప్రతిపక్షాలపై ధ్వజమెత్తారు. డీఎంకే, కాంగ్రెస్ సహా ప్రధాన ప్రతిపక్షాలన్నీ తమ వారసుల సంక్షేమం కోసం పాటుపడుతున్నాయని, తాను దేశ ప్రజల సంక్షేమం కోసమే కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. తిరునెల్వేలి హల్వాలాగే ఈ జిల్లాకు చెందిన ప్రజలంతా తియ్యటి స్వభావం కలిగినవారన్నారు. నెల్లయప్పర్‌స్వామికి, కాంతిమది అమ్మవారికి తన వందనాలు అంటూ ఆయన ప్రసంగాన్ని ప్రారంభించారు. రెండు రోజులుగా తన పర్యటన పొడవునా రాష్ట్ర ప్రజలు తనపై చూపుతున్న ఆదరాభిమానాలకు ఫిదా అయ్యానని చెప్పారు. రాష్ట్రాన్ని సరైన మార్గంలో నడిపించగల సత్తా బీజేపీకి మాత్రమే ఉంద న్నారు. రాష్ట్రాభివృద్ధికి తాను చేసిన హామీలన్నింటినీ తప్పకుండా నెరవేరుస్తానని చెప్పారు. తమిళులు ఎల్లప్పుడూ భవిష్యత్తు పట్ల చక్కటి అవగాహన కలిగి ఉంటారని, సాంకేతిక పరిజ్ఞానంలో ముందంజలో ఉంటారని చెప్పారు. దేశం వందడుగులు అభివృద్ధి చెందితే రాష్ట్రం కూడా అంతే పరిమాణంలో ముందుకెళ్తుందన్నారు. బీజేపీ సిద్ధాంతాలు తమిళ ప్రజల సిద్ధాంతాలు ఒక్కటిగానే ఉన్నాయని చెప్పారు. తనకు తమిళ భాష ఔన్నత్యం గురించి మాత్రమే తెలుసునని, తమిళభాషలో మాట్లాడలేక పోతున్నాననే బాధ తనకు ఎక్కువగా ఉందన్నారు. తాను మాట్లాడేదేమిటో తెలియకపోయినా సభకు హాజరైన జనమంతా తానుమంచి మాటలే చెబుతున్నానని భావించి చప్పట్లు కొట్టడం తనకెంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. బీజేపీ 400పైచిలుకు స్థానాల్లో గెలుస్తుందని ఆయన చెప్పారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న డీఎంకే పాలకులకు దేశ ప్రజల సంక్షేమం కంటే వారి వారసుల సంక్షేమమే ముఖ్యమన్నారు. ఇక హిందీ, తమిళం అంటూ భాషాపరంగా తమిళ ప్రజల మధ్య చిచ్చురగల్చటమే డీఎంకే పనిగా ఉంటోందని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి భాషాపరమైన తారతమ్యాలు లేవని, తమిళ భాష ఔన్నత్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఎలుగెత్తి చాటుతోందన్న విషయాన్ని ప్రజలంతా గమనించాలని చెప్పారు. రాష్ట్రానికి చెందిన దళితుడైన ఎల్ మురుగన్‌ను హిందీ మాట్లాడే రాష్ట్రంనుంచి ఎంపీగా గెలిపించిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత డీఎంకే కనుమరుగవడం ఖాయమన్నారు.

అభివృద్ధిని పట్టించుకోరా?

కేంద్రప్రభుత్వ పథకాలను కూడా తమ పథకాలుగా ప్రకటించుకుని పబ్బం గడుపుతోందన్న మోదీ డీఎంకే నాయకులు దేశాభివృద్ధిని పట్టించుకోవడం లేదన్నారు. భారతీయ శాస్త్రవేత్తలను, అంతరిక్ష శాఖను, ప్రజలు చెల్లిస్తున్న పన్నులను అగౌరవపరస్తున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంపై ఎలాంటి తారతమ్యాన్ని ప్రదర్శించడం లేదని, ప్రజల నుండి పన్నుల రూపేణా వసూలు చేసిన సొమ్ముతోనే పథకాలు అమలు చేస్తున్నామన్నారు. భారతీయులకు ఎక్కడ ఎలాంటి ముప్పు కలిగినా కేంద్రం కాపాడుతుందని, పైలెట్ అభినందన్ పాకిస్థాన్‌లో చిక్కుకున్నప్పుడు స్వలగాయం కూడా తగులకుండా స్వదేశానికి రప్పించడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇక శ్రీలంకలో శిక్ష విధించిన తమిళ జాలర్లను కాపాడి తీసుకువచ్చామని, ఖతార్‌లో మరణశిక్ష విధించిన జాలర్లను కాపాడామని ఆయన వివరించారు. ఇండియా కూటమిలోని పార్టీలకు చెందిన ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి సాహసోపేతమైన చర్యలు చేపట్టలేదన్న విషయాన్ని ప్రజలందరూ గమనించాలన్నారు. ఈ సభలో కేంద్ర మంత్రి ఎల్ మురుగన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, పార్టీ ప్రముఖులు పొన్ రాధాకృష్ణన్, పొంగులేటి సుధాకర్ రెడ్డి, నయినార్ నాగేంద్రన్, మాజీ ఎమ్మెల్యే విజయధరణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడిపైనా విమర్శలే...

డీఎంకే నాయకులు శ్రీరాముడికి తమిళనాడుకు ఉన్న సంబంధాలు ఏమిటని ప్రశ్నిస్తున్నారని, అదే సమయంలో పార్లమెంటులో రామాలయం గురించి జరిగిన చర్చల్లో ఆ పార్టీ ఎంపీలు పాల్గొనకుండా వాకౌట్ చేసి కోటానుకోట్ల మంది భారతీయుల విశ్వాసానికి విఘాతం కలిగించారని మోదీ విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాల ప్రజల కష్టనష్టాలేమిటో బీజేపీకి తెలుసునని, మళ్లీ అధికారంలోకి వస్తే ఆ సమస్యలన్నీ పటాపంచలవుతాయని చెప్పారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం సహకరించని ప్రభుత్వం అధికారంలో ఉందని, కేంద్రం ఏ పథకాలను ప్రకటించినా వాటిలో లోపాలు వెదకడమే పనిగా పెట్టుకుందన్నారు. డీఎంకే ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పథకాలు అమలు చేయకుండా విపరీతంగా అప్పులు చేస్తోందన్నారు.

వారంతా అడ్రస్ లేకుండా

పోయారు


మీనంబాక్కం విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న కనిమొళి

● మోదీకి కనిమొళి కౌంటర్

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): డీఎంకే నాశనాన్ని కోరుకున్నవారంతా పత్తాలేకుండా పోయారని ఆ పార్టీ ఎంపీ కనిమొళి ప్రధాని మోదీకి కౌంటర్ ఇచ్చారు. తిరునెల్వేలి బహిరంగసభలో మోదీ ప్రసంగిస్తూ డీఎంకే అడ్రస్ లేకుండా పోతుందని చేసిన విమర్శలను ఆమె తీవ్రంగా ఖండించారు. తూత్తుకుడిలో ప్రధాని పాల్గొన్న కార్యక్రమంలో పాల్గొని విమానంలో చెన్నైకి చేరుకున్న కనిమొళి విమానాశ్రయం వద్ద విలేకరులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటం వల్లే రెండు రోజుల రాష్ట్ర పర్యటనలో ప్రధాని మోదీ అదేపనిగా పథకాలను ప్రకటిస్తున్నారని విమర్శించారు. గత మూడేళ్లుగా ముఖ్యమంత్రి స్టాలిన్ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం చేసిన ప్రతిపాదనలు గురించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కేంద్రం అమలు చేసే మంచి పథకాలను డీఎంకే ప్రభుత్వం ఎన్నడూ వ్యతిరేకించదన్నారు. ప్రధాని ఆవాస్ యోజన పథకం కింద ఇళ్లు నిర్మించేందుకు కేంద్రం పావు శాతం నిధులు మాత్రమే కేటాయిస్తుందని, ముప్పావు శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోందని గుర్తు చేశారు. రాష్ట్ర రాజకీయ చరిత్రను పరిశీలిస్తే డీఎంకే నాశనమవుతుందని చెప్పినవారంతా పత్తా లేకుండా పోయారని కనిమొళి అన్నారు. కులశేఖరపట్టినం రాకెట్ ప్రయోగ కేంద్రం కోసం స్థలమిచ్చింది రాష్ట్ర ప్రభుత్వమేనని, అక్కడ రాకెట్ ప్రయోగ కేంద్రం ఏర్పాటు చేయాలని యేళ్లతరబడి డిమాండ్ చేసింది డీఎంకే నాయకులేనని పేర్కొన్నారు. తూత్తుకుడి హార్బర్‌లో జరిగిన సభలో తాను, రాష్ట్రమంత్రి ఈవీ వేలు పాల్గొన్న మోదీ తన ప్రసంగంలో తమ ఇరువురి పేర్లను ప్రస్తావించనే లేదని వాపోయారు. రాకెట్ ప్రయోగ కేంద్రం ద్వారా రాష్ట్రం కీర్తి పెరుగుతుందనే భావనతోనే ఆ సభలో తాను పాల్గొన్నానని చెప్పారు. రాజకీయాలు, వేరు, మతాలు వేరు అనే భావన కలిగినవారే తమిళ ప్రజలని ఆమె చెప్పారు. హరించుకుపోతున్న రాష్ట్ర ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడే పార్టీ డీఎంకే మాత్రమేనని ఆమె తెలిపారు.

స్టాలిన్‌పై భయంతోనే మోదీ పర్యటన
- ఆర్ఎస్ భారతి

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌పై ఉన్న భయంతోనే ప్రధాని నరేంద్రమోదీ తరచూ రాష్ట్రంలో పర్యటిస్తున్నారని డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి విమర్శించారు. పెరుగుతున్న స్టాలిన్ కీర్తిని చెడగొడితే ఇండియా కూటమిని బలహీనపరచ వచ్చునని భావించే మోదీ వారానికొకమారు రాష్ట్ర పర్యటనకు వస్తున్నారని యెద్దేవా చేశారు. దివంగత నేతలు అన్నాదురై, కరుణానిధి బాటలో ద్రావిడ తరహా సుపరిపాలనను అందిస్తున్న డీఎంకే లోక్‌సభ ఎన్నికల్లోనూ ఘనవిజయం సాధిస్తుందని, ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీజేపీ కనిపించకుండా పోతుందని చెప్పారు.


హార్బర్ కలెక్టరేట్ సమీపంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నల్లజెండాలతో నిరసన తెలుపుతున్న సెల్వపెరుందగై తదితరులు



వరదనీటి నివారణ పనులను ప్రారంభిస్తున్న సీఎం

రూ.837 కోట్లతో వరద నీరు అడ్డుకట్ట నిర్మాణాలు

రూ.111.35 కోట్లతో సాగునీటి పనులు ● శంకుస్థాపన చేసిన సీఎం స్టాలిన్

అడయార్, ఫిబ్రవరి 28: రాష్ట్రవ్యాప్తంగా రూ.837 కోట్లతో వరద నీటి ప్రవాహాన్ని అడ్డుకునేందుకు వీలుగా వివిధ ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టనున్నారు. ఈ నిర్మాణాలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బుధవారం సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపనలు చేశారు. అలాగే, రూ.111.35 కోట్లతో పూర్తి చేసిన సాగునీటి పనులను ఆయన కూడా ప్రారంభించారు. మిచౌంగ్ తుఫాను కారణంగా ఆరు దక్షిణాది జిల్లాల్లో సంభవించిన వరదల కారణంగా అపారనష్టం వాటిల్లింది. ఈ జిల్లాల్లో రూ.726.50 కోట్లతో 503 ప్రాంతాల్లో శాశ్వత నిర్మాణాలు చేపట్టనున్నారు. అదేవిధంగా రాష్ట్రంలోని 24 జిల్లాల్లో రూ.115 కోట్లతో 1004 ప్రాంతాల్లో పూడికతీత పనులకు కూడా ఆయన శంకుస్థాపనలు చేశారు.

ప్రారంభోత్సవాలు ఇవే...

శివగంగై జిల్లా మానామదురై, కుట్టికుళం, మిలగనూరు ఇతర కాల్వలకు నీటిని సరఫరా చేసే విధంగా రూ.30.60 కోట్లతో 6,316 ఎకరాలకు సాగునీటిని అందించేలా జలాశయాన్ని ప్రారంభించారు. అదేవిధంగా తిరుచెందూరు - పున్నకాయల్, సేందమంగళం, శ్రీవైకుంఠం, ముక్కాణి, తామ్రభరణి నది సముద్రంలో కలిసే ప్రాంతంలో రూ.46.14 కోట్లతో 2,976 ఎకరాలకు సాగునీటిని అందించేలా చిన్నపాటి డ్యాంలు, తూత్తుక్కుడిలో రూ.34.61 కోట్లతో 12,447 ఎకరాలకు సాగునీటిని పంపిణీ చేసేలా నిర్మించేలా చెక్ డ్యాంలతో మరికొన్ని ప్రాంతాల్లో నిర్మించిన సాగు నిర్మాణాలను ప్రారంభించారు.

వరద నీటి నివారణ పనులకు...

గత యేడాది డిసెంబరులో కురిసిన అతి భారీ వర్షాలకు తిరునెల్వేలి, తూత్తుక్కుడి, తెన్‌కాశి, కన్నియాకుమారి, విరుదునగర్, రామనాథపురం జిల్లాల్లో అపారనష్టం వాటిల్లిన విషయం తెల్సిందే. తిరునెల్వేలి జిల్లాలో రూ.102.13 కోట్లతో 233 వరద నివారణ పనులు చేపట్టనున్నారు. తెన్‌కాశి జిల్లాలో రూ.19.38 కోట్లతో 67 నిర్మాణ పనులు, కన్నియాకుమారి జిల్లాలో రూ.4.35 కోట్లతో 17 పనులు, తూత్తుక్కుడి జిల్లాలో రూ.152.06 కోట్లతో 155 నిర్మాణ పనులు, రామనాథపురం జిల్లాలో రూ.91 లక్షలతో 10 నిర్మాణ పనులు, విరుదునగర్ జిల్లాలో రూ.1.17 కోట్లతో 8 నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. దక్షిణాది జిల్లాల్లో శాశ్వత నిర్మాణాల్లో భాగంగా, 269 కల్వర్టులు, 171 కాలువలు, నదులపై ఆరు చెక్ డ్యాంలు నిర్మించనున్నారు. తిరునెల్వేలి జిల్లాలో 88,365 ఎకరాలు, తెన్‌కాశి జిల్లాలో 88,112 ఎకరాలు, తూత్తుక్కుడి జిల్లాలో 51,965 ఎకరాలు, కన్నియకుమారి జిల్లాలో 7,754 ఎకరాలు, విరుదునగర్ జిల్లాలో 5,094 ఎకరాలు, రామనాథపురం జిల్లాలో 4,200 ఎకరాలతో కలుపుకుని మొత్తం 2,45,490 ఎకరాలకు సాగునీరు అందించేలా కల్వర్టులు, చెక్ డ్యాంలు నిర్మించనున్నారు.

శాశ్వత నిర్మాణాలు

చెన్నై, తిరువళ్ళూరు, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాల్లో వరద నీరు ప్రవాహాన్ని అడ్డుకునేందుకు వీలుగా వివిధ రకాల శాశ్వత నిర్మాణాలు చేపట్టనున్నారు. ఈ నిర్మాణాలు పూర్తయితే సెంబాక్కం, తాంబరం, మూవరసంపేట, కీళ్‌కట్టలై, నారాయణపురం, పళ్ళికరణి, వీచ్చూరు, జయరాంపురం, గెరుగంబాక్కం, మణపాక్కం, పుళల్, పొన్నేరి, పూందమల్లి, చోళవరం, తిరువొత్రియూరు ప్రాంతాల్లో బీడు భూములు సాగుబడిలోకి తెచ్చేలా, వరద నీటి ప్రవాహాన్ని అడ్డుకునేలా నిర్మాణాలు చేపట్టనున్నారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా 5,814 కిలోమీటర్ల విస్తీర్ణంలో పూడికతీత పనులకు సీఎం స్టాలిన్ ప్రారంభించారు. ఈ పూడిక పనులు పూర్తయితే 14,55,680 ఎకరాల్లో భూమి సాగులోకి వస్తుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఈ కార్యక్రమంలో మంత్రి దురైమురుగన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివ్‌దాస్ మీనా, సాగునీటి శాఖ అదనపు కార్యదర్శి సందీప్ సక్సేనా తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ ప్రధాని అయితే

తమిళ జాలర్లకు కష్టాలుండవ్

టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై ● చెన్నైలో కాంగ్రెస్ ధర్నా

ప్యారీస్, ఫిబ్రవరి 28: కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ దేశప్రధానిగా బాధ్యతలు స్వీకరిస్తేనే తమిళ జాలర్లు నష్టపోరని, సముద్రంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చేపల వేటలో పాల్గొనవచ్చని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై పేర్కొన్నారు. రాష్ట్రంలోని రామనాథపురం, పుదుకోట తదితర జిల్లాల నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లే తమిళ జాలర్లపై శ్రీలంక నావికాదళ సిబ్బంది దాడులకు పాల్పడడంతో పాటు వారి పడవలు స్వాధీనం చేసుకోవడం, జైలుకు తరలించడం వంటి చర్యలను కేంద్రప్రభుత్వం అడ్డుకోవడం లేదంటూ బుధవారం ఉదయం టీఎన్‌సీసీ ఆధ్వర్యంలో హార్బర్ నియోజకవర్గంలోని కలెక్టర్ కార్యాలయ సమీపంలో నల్లజెండాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ ధర్నా ప్రారంభించిన అనంతరం సెల్వపెరుందగై మాట్లాడుతూ... కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మత్స్యకారులు, రైతులు, శ్రమజీవులను అణచివేయడంలో ముందుందని, ఈ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకే కాంగ్రెస్ నేతృత్వంలో ఏర్పడిన ఇండియా కూటమిని అధికస్థానాల్లో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓటర్లను దేవుళ్లుగా భావిస్తుందని అయితే, ప్రధాని మోదీ ప్రభుత్వం ఈవీఎంలను నమ్ముకొని ఎన్నికలు ఎదుర్కోనుందని విమర్శించారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, మన్మోహన్‌సింగ్ తరహాలోనే దేశప్రజలకు రాహుల్ గాంధీ మంచి పాలన అందిస్తారన్నారు. ఆయన ప్రధాని అయితే కుల, మత విద్వేషాలకు తావుండదన్నారు. సామాజిక న్యాయానికి దారి చూపుతున్న తమిళ గడ్డపై కమలనాథుల గోబెల్ ప్రచారాన్ని నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్‌కు ఆశించిన సీట్లు లభిస్తాయని అయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్ని సీట్లలో పోటీ చేయాలి, ఏఏ నియోజకవర్గాలన్న విషయమై డీఎంకేతో తమ పార్టీ అధిష్ఠానం చర్చిస్తుందన్నారు. సీట్ల కేటాయింపు ప్రతిష్టంబన త్వరలో తొలగిపోతుందని సెల్వపెరుందగై అన్నారు. ఈ ధర్నాలో కేంద్ర మాజీ మంత్రి కేవీ తంగబాలు, ఎమ్మెల్యే హసన్‌మౌలానా, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


చిన్న శేష వాహనంపై పద్మావతి అమ్మవారి దివ్యదర్శనం

ప్యారీస్, ఫిబ్రవరి 28: స్థానిక టి.నగర్ జీఎన్ చెట్టి రోడ్డులో ఉన్న పద్మావతి అమ్మవారి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటలకు శుభలగ్నంలో ఆలయ అర్చకులు ఆగమశాస్త్రం ప్రకారం పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న ధ్వజస్తంభంపై ప్రత్యేకంగా రూపొందించిన అమ్మవారి పతాకాన్ని ఆవిష్కరించి బ్రహ్మోత్సవాలకు నాంది పలికారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 9 నుంచి 11.30 గంటల మధ్య కుంకుమార్చన, సాయంత్రం విష్వక్సేన ఆరాధనతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తమిళనాడు, పుదుచ్చేరి ఆలయాల సలహా మండలి అధ్యక్షుడు ఏ.జే.శేఖర్, సభ్యులు బి.మోహనరావు, అనిల్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, జయదేవరావు హాజరైన ధ్వజారోహణం పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పతాకావిష్కరణ సమయంలో భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. మధ్యాహ్నం అందంగా అలంకరించిన అమ్మవారిని చిన్న శేష వాహనంపై వేంచేపు చేసి ఆలయ ప్రాంగణంలో విహరింపజేసిన అనంతరం భక్తులను క్యూలైన్ల ద్వారా దర్శనానికి అనుమతించారు. టీటీడీ ఆగమ సలహాదారులు మణికంఠ, పద్మావతి అమ్మవారి ఆలయ సూపరింటెండెంట్ పుష్పలత పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాల క్రతువు నేత్రపర్వంగా సాగింది. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ సందర్భంగా గాయత్రి బృందంచే భక్తిపాటల సంగీత విభావరి శ్రోతలను అలరించింది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణాన్ని, అమ్మవారి సన్నిధిని రకరకాల పుష్పాలతో, మామిడి, అరటి తోరణాలతో, విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పూజల్లో పాల్గొన్న భక్తులందరికీ ప్రసాదాలు పంపిణీ చేశారు.


ధ్వజారోహణ దృశ్యం


ధ్వజారోహణంలో పాల్గొన్న మండలి అధ్యక్షుడు ఏజే శేఖర్ దంపతులు

సమాచార దర్శిని

పీఎం సౌరవిద్యుత్ పథకం... ఏడు రోజుల్లో 25 వేల దరఖాస్తులు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 28: పీఎం సౌరవిద్యుత్ పథకానికి ఏడు రోజుల్లో 25వేలమంది దరఖాస్తు చేసుకున్నారు. దేశవ్యాప్తంగా కోటి గృహాలకు సౌరశక్తి ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రధానమంత్రి ప్రారంభించారు. ఈ పథకంలో కిలోవాట్ సామర్థ్యంతో సోలార్ విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు రూ.30 వేలు, 2 కిలోవాట్ సామర్థ్యం కలిగిన కేంద్రానికి రూ.60 వేలు, ఆపైన రూ.78 వేలు సబ్సిడీ అందిస్తున్నారు.ఈరుసుము లబ్ధిదారుల బ్యాంక్‌ఖాతాలో నేరుగా జమ అవుతుంది. రాష్ట్రంలో 25 లక్షల గృహాల్లో ఈ విద్యుత్ కేంద్రాలు ఏర్పాటుకు నిర్ణయించిన విద్యుత్ బోర్డు, ఈనెల 20వతేదీనుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. వారం రోజుల్లో 25,000మంది సమర్పించినట్టు అధికారులు తెలిపారు.

ఆధార్ నెంబరు మాస్కింగ్

ఐసిఎఫ్, ఫిబ్రవరి 28: దస్తావేజుల్లో ఆస్తి యజమానుల ఆధార్ నెంబరును భద్రత కారణాల కోసం మాస్కింగ్ విధానంలో దాచి ఉంచే విధానాన్ని రిజిస్ట్రేషన్ శాఖ అమలుపరిచేందుకు చర్యలు చేపట్టింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్టర్ అయ్యే పత్రాలప్రతుల ఒరిజినల్ దస్తావేజులు సంబంధిత వ్యక్తి చేర్చారి.ఒకవ్యక్తి ఆస్తులకు సంబంధించి ఎవరైనా దస్తావేజుల ప్రతి పొందవచ్చు. ఇందుకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకొని రుసుము చెల్లిస్తే చాలు.ప్రతిని అందజేస్తున్నప్పుడు రిజిస్ట్రేషన్ సమయంలో ఇచ్చిన ఆధార్ వివరాలు తెలియకుండా మాస్కింగ్ విధానాన్ని అమలు చేయనున్నట్టు రిజిస్ట్రేషన్ శాఖ తెలిపింది.

పోస్ట్ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్

ఐసిఎఫ్, ఫిబ్రవరి 28: పోస్ట్ ద్వారా డ్రైవింగ్ లైసెన్సులు పంపనున్నట్లు రవాణా శాఖ కమిషనర్ షణ్ముగసుందరం తెలిపారు. వాహన, సారథి సాఫ్ట్‌వేర్‌లో పేర్కొన్న మొబైల్ నెంబరు, చిరునామాలో లోపాలుండి పోస్ట్ రిటర్న్ అయితే, తగిన దస్తావేజులు, రుసుము చెల్లించి సవరించిన అనంతరమే డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు పోస్ట్ ద్వారా లైసెన్స్‌లు పంపుతామని తెలిపారు. సాయంత్రం 4 గంటల వరకు ప్రింటయ్యే లైసెన్స్‌లను ఆ రోజు పంపుతామన్నారు.

గువహటికి పార్శిల్ రైలు సేవలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 28: స్థానిక కొరుక్కుపేట నుంచి గువహటికి పార్శిల్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కొరుక్కుపేట నుంచి తొలిసారిగా ఈ సేవలను దక్షిణ రైల్వే చెన్నై రైల్వే డివిజన్ ప్రారంభించింది. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... ఆరేళ్ల వరకు రూ.105 కోట్లకు ప్రైవేటు సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఒకే సమయంలో 484 టన్నుల వస్తువులు తరలించనున్నామని, నెలకు నాలుగు రోజులు ఈ పార్శిల్ సేవలు కొనసాగుతాయన్నారు.

2న సహకార ప్రత్యేక శిబిరాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 28: సహకార సంస్థల్లో పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాల రుణాలను వసూలుకు ప్రత్యేక శిబిరాలు మార్చి 2వ తేది జరగనున్నాయని ఆ శాఖ మంత్రి పెరియకరుప్పన్ తెలిపారు. సహకార బ్యాంకులు, సంఘాలు ప్రజలకు వివిధ రుణాలు అందిస్తున్నాయి. రుణ బకాయిల వసూలుకు ప్రత్యేక రాయితీ ప్రకటించారు. అందులో, అసలుపై 9 శాతం వడ్డీ వసూలు చేసి అదనపు వడ్డీ, జరిమానా, ఇతర వ్యయాలు మాఫీ చేయనున్నారు. 2.62 లక్షల రుణాలను గుర్తించిన అధికారులు, 2.13 లక్షల మందికి నోటీసులు పంపారు. వారిలో 3,438 మంది నుంచి రూ.9 కోట్లు వసూలైంది.

మే 31లోపు కొత్త టీచర్ల నియామకం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 28: ప్రభుత్వ పాఠశాలల్లో డిగ్రీ, సెకండరీ గ్రేడ్ టీచర్ ఖాళీ పోస్టుల్లో మే 31వ తేదిలోపు కొత్త ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఈ పోస్టుల భర్తీకి టైంటేబుల్‌ను ఈ శాఖ విడుదల చేసింది. యేటా జనవరి 31వ తేదిలోపు పరీక్షలు నిర్వహించి ఏప్రిల్ 30లోపు ఫలితాలు విడుదల చేసి, మే 31లోపు నియామకాలు చేపట్టాల్సి ఉంది. ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్ జూన్ 30లోపు చేపట్టనున్నారు.

డీజీపీ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్

ఐసిఎఫ్, ఫిబ్రవరి 28: డీజీపీ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్ ప్రారంభించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి సైబర్ క్రైం పోలీసులు విచారణ జరుపుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి భద్రతా విభాగం డీజీపీ తిరునావుక్కరసు మంగళవారం చెన్నై సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన పేరున నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్ ప్రారంభించి మిత్రుల వద్ద నగదు వసూలు చేసేందుకు గుర్తుతెలియని వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయం స్నేహితుల ద్వారా తెలుసుకున్నానని, దీనిపై చర్యలు చేపట్టాలని కోరారు. దీంతో, పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఐసీఏఐ ఆఫీస్ ఇన్‌ఛార్జుల ఎంపిక

ఐసిఎఫ్, ఫిబ్రవరి 28: ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఛార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) దక్షిణ భారత ప్రాంతీయ కౌన్సిల్ కార్యాలయ ఇన్‌ఛార్జుల ఎంపిక జరిగింది. ఈ కౌన్సిల్ 258వ సమావేశం నుంగంబాక్కంలో జరిగింది. 2024-25 సంవత్సరానికి కార్యాలయ ఇన్‌చార్జుల ఉప ఎన్నిక జరుగ్గా, బెంగళూరుకు చెందిన గీత అధ్యక్షురాలిగా, చెన్నైకి చెందిన రేవతి రఘునాథన్ ఉపాధ్యక్షురాలిగా, ఆంధ్ర రాష్ట్రం గుంటూరుకు చెందిన సుబ్బారావు ముప్పాల కార్యదర్శిగా, కేరళ రాష్ట్రం త్రిస్సూర్‌కు చెందిన సతీశన్ కోశాధికారిగా ఎంపికయ్యారు. అలాగే, దక్షిణ భారత ఛార్టెట్ అకౌంటెంట్ విద్యార్థుల సంఘ అధ్యక్షుడిగా హైదరాబాద్‌కు చెందిన మాండవ సునీల్‌కుమార్ నియమితులయ్యారు.

రేపటినుంచి ఏరికరై శ్మశానవాటిక మూసివేత

పెరంబూర్, ఫిబ్రవరి 28: స్థానిక అడయార్ మండలం 170వ వార్డు కొట్టూరుపురం ఏరికరై శ్మశానవాటికలో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా మార్చి 1 నుంచి 31వ తేది వరకు మూసివేయనున్నారు. అందుకు బదులుగా 162 వార్డు పరిధిలోని గురునానక్ శ్మశానవాటిక, 174వ వార్డు పరిధిలోని బిసెంట్‌నగర్ శ్మశానవాటికలను వినియోగించుకోవాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది.

కొత్త వైద్య బీమా యాప్ ప్రారంభం

ప్యారీస్, ఫిబ్రవరి 28: కొత్త వైద్య బీమా పథకానికి వెబ్‌సైట్, మొబైల్ యాప్ సేవలను ఆర్థిక శాఖ మంత్రి తంగం తెన్నరసు బుధవారం ప్రారంభించారు. స్థానిక నందనంలో ఉన్న ప్రొఫెసర్ అన్బళగన్ మహల్‌లో ఏర్పాటుచేసిన కలైంజర్ గ్రంథాలయం, ఆడిటింగ్, అకౌంట్స్, ట్రెజరీ శాఖల ఉద్యోగుల శిక్షణ కేంద్రాన్ని మంత్రి తంగం తెన్నరసు ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ... కొత్త వైద్య బీమా పథకం కోసం ప్రారంభించిన యాప్‌ను ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య బీమా పథకంలో గుర్తింపుపొందిన ఆసుపత్రుల్లో చికిత్సలు పొందవచ్చన్నారు. కొత్త వెబ్‌సైట్, యాప్‌లో సంబంధిత ఆసుపత్రులు, అందుబాటులో ఉన్న చికిత్సలు తదితర వివరాలను సులువుగా తెలుసుకోవచ్చన్నారు. ప్రభుత్వ నిర్వహణలోకి ఆడిటింగ్, అకౌంట్స్, ట్రెజరీ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు రూ.16.11 కోట్లతో ఆధునిక వసతులతో నిర్మించిన కేంద్ర ప్రాంగణంలోనే మరో రూ.9.85 లక్షలతో కలైంజర్ గ్రంథాలయం కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని మంత్రి తెలిపారు.

మోదీ రాకను నిరసిస్తూ నల్ల జెండాలతో ప్రదర్శన

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా పాళయంకోట బస్‌స్టేషన్ వద్ద బుధవారం ఉదయం ప్రధాని నరేంద్రమోదీ రాకను నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర మాజీ మంత్రి ధనుష్కోడి ఆదిత్తన్ నివాసగృహంలో సమావేశమైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నల్లజెండాలు, నల్ల బెలూన్లు చేతపట్టుకుని అక్కడి నుంచి బయలుదేరి పాళయం కోట బస్‌స్టేషన్ పెరియార విగ్రహం కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. ఆ తర్వాత నల్ల బెలూన్లను ఎగురవేశారు. అనుమతి లేకుండా ఈ ప్రదర్శన నిర్వహించడంతో ధర్నా జరిపిన సుమారు వందమందిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రధాని రాకను నిరసిస్తూ కాంగ్రెస్ జిల్లా శాఖ నాయకులు నల్లజెండాలతో ప్రదర్శన జరపనున్నట్లు సమాచారం అందడంతో దాన్ని అడ్డుకోవడానికి తిరునల్వేలిలోని కాంగ్రెస్ కమిటీ కార్యాలయం చుట్టూ పోలీసులు నిలిచి పార్టీ శ్రేణులను గుమికూడ కుండా కట్టుదిట్టం చేశారు. కానీ స్థానిక కాంగ్రెస్ నాయకులు ధనుష్కోడి ఆదిత్తన్ నివాసగృహంలో బుధవారం ఉదయమే గుమికూడి నల్లజెండాల ప్రదర్శనను ప్రారంభించారు.



నల్ల బెలూన్లను ఎగురవేస్తున్న కాంగ్రెస్ ప్రముఖులు, కార్యకర్తలు



తూత్తుకుడి పర్యటనకు విచ్చేసిన ప్రధాని నరేంద్రమోదీకి నమస్కరిస్తూ స్వాగతం పలుకుతున్న రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి



చెన్నై సచివాలయంలో కరుణానిధి శతజయంతి ముగింపు వేడుకల సందర్భంగా తమిళ పండితుడికి 'సాహిత్య శిఖామణి అవార్డు'ను ప్రదానం చేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

5.53 లక్షల డోసుల పోలియో చుక్కలు సిద్ధం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 28: నగరంలో 5.53 లక్షల మంది పిల్లలకు పోలియో చుక్కల మందు సిద్ధం చేసినట్టు కార్పొరేషన్ కమిషనర్ రాధాకృష్ణన్ తెలిపారు. దేశవ్యాప్తంగా మార్చి 3వ తేది పల్స్‌పోలియో శిబిరాలు జరగనున్నాయి. ఈ విషయమై కార్పొరేషన్ కమిషనర్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ... చెన్నైలో 77.76 లక్షల మంది నివసిస్తున్నారని, వారిలో ఐదేళ్లలోపున్న పిల్లలు 5.53 లక్షల మంది ఉన్నారని తెలిపారు. వీరికి 3వ తేది 115 బస్టాండ్లు, 46 మొబైల్ వాహనాలతో 1,646 కేంద్రాల్లో పోలియో చుక్కల మందు వేయనున్నట్లు, ఇందుకోసం 7,000 మంది సిబ్బందిని నియమించామన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ శిబిరాల్లో తల్లిదండ్రులు పిల్లలకు తప్పనిసరిగా చుక్కల మందు వేయించాలని కోరారు.

రూ.2 కోట్లతో సర్వీస్ రోడ్డు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 28: స్థానిక కోయంబేడు 100 అడుగుల రోడ్డులో రూ.2 కోట్ల తో సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కోయంబేడు బస్ టెర్మినల్ ఎదుట రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం, జయనగర్ పార్కు, విద్యుత్ బోర్డు కార్యాలయాలున్నాయి.ఈ ప్రాంతంలో 100 అడుగుల రోడ్డులో భవన నిర్మాణ , ఆహార, ప్లాస్టిక్ వ్యర్థాలతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. దీనిపై ఫిర్యాదులందడంతో చెత్తకుప్పలు తొలగించి రూ.2 కోట్లతో 250 మీటర్ల దూరం సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఇందుకోసం ఎన్నికల కమిషన్ నుంచి సిగ్నల్ వరకు ఇనుప డివైడర్ ఏర్పాటు చేశారు.

మాజీ ఖైదీలకు సహాయాలు



ఖైదీలకు కిరాణా సరుకులు అందజేస్తున్న నిర్వాహకులు

వేలూరు, ఫిబ్రవరి 28: స్థానిక సెంట్రల్ జైలు నుంచి ముందుగా విడుదలైన ఇద్దరు ఖైదీలకు వేలూరు జైలు మాజీ ఖైదీల ఆదరణ సంఘం తరపున 21 రకాల కిరాణా సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు, న్యాయవాది విజయరాఘవన్, సెక్రటరీ జనార్దనన్, కోశాధికారి శ్రీనివాసన్, జైలు సూపరింటెండెంట్ అబ్దుల్ రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, సత్తువాచేరికి చెందిన సెల్వం, తిరువణ్ణామలైకు చెందిన మోహన్ యావజ్జీవ ఖైదీలుగా శిక్ష అనుభవిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులతో ముందుగానే విడుదలయ్యారు.

సీఎంసీలో మందుల వారోత్సవాలు

వేలూరు, ఫిబ్రవరి 28: స్థానిక సీఎంసీ ఆసుపత్రిలో బుధవారం మందుల శాఖ తరపున 72వ జాతీయ మందుల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమాన్ని మందుల కంట్రోల్ శాఖ మండల డైరెక్టర్ నందకుమార్ ప్రారంభించగా, సీఎంసీ వైద్యశాఖ అధ్యక్షుడు రొనాల్డ్ కేరి, మెడికల్ రెప్రజెంటేటివ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌లో, డయాబెటిస్ మందులతో వచ్చే ఇతర సమస్యలు, శ్వాస సంబంధిత సమస్యలకు మందులు, చిరుధాన్యాల ప్రాధాన్యం తదితర అంశాలు చోటుచేసుకున్నాయి.

బన్రూట్టి ఎమ్మెల్యే ఇంట్లో ఏసీబీ తనిఖీలు



తనిఖీలు జరిగిన గృహం

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా బన్రూట్టి అన్నాడీఎంకే మాజీ శాసనసభ్యురాలు సత్యా పన్నీర్‌సెల్వం నివాస గృహంలో అవినీతి నిరోధక విభాగం పోలీసులు బుధవారం ఉదయం తనిఖీలు జరిపారు. సత్యా భర్త పన్నీర్‌సెల్వంపై దాఖలైన మోసం కేసు విచారణలో భాగంలో ఈ సోదాలు నిర్వహించారు. పన్నీర్‌సెల్వం 2011-16 వరకు బన్రూట్టి మునిసిపాలిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ సమయంలో ద్విచక్రవాహనాల పార్కింగ్ స్థలాల టెండర్ల జారీ సందర్భంగా రూ.20లక్షల దాకా మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఏసీబీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును చేపట్టారు. ఆ క్రమంలోనే బుధవారం ఉదయం శాసనసభ్యురాలు సత్యా పన్నీర్‌సెల్వం నివాస గృహంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు.

రేపటినుంచి ప్లస్‌టూ పబ్లిక్ పరీక్షలు

పెరంబూర్, ఫిబ్రవరి 28: రాష్ట్ర పాఠ్యప్రణాళికలో టెన్త్, ప్లస్‌వన్, ప్లస్‌టూ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు ఒకటి తర్వాత మరొకటి ప్రారంభం కానున్నాయి. ప్లస్ టూ పరీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన సుమారు 9.25 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. రాష్ట్రంలో 3,302 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వ పరీక్ష శాఖ, కేంద్రాల్లో కనీస వసతుల కల్పన పూర్తి చేసింది. ఈ పరీక్షల్లో ప్రశ్నపత్రం లీకేజీ అడ్డుకొనేలా భద్రతా చర్యలు చేపట్టారు. అలాగే, పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు కాపీయింగ్ పాల్పడడాన్ని అడ్డుకొనేలా 3,200 ఫ్లయింగ్‌స్క్వాడ్ ఏర్పాటయ్యాయి. పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్, చిట్టాలు పెట్టి రాయడం, జవాబు పత్రాలు మార్చుకోవడం తదితర చర్యలకు పాల్పడే విద్యార్థులపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

22వ తేది వరకు... : శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు 22వ తేది వరకు జరగనున్నాయి. తొలుత తమిళ పరీక్ష, అనంతరం 5వ తేది ఆంగ్లం, 8వ తేది కంప్యూటర్ సైన్స్, బయోకెమిస్ట్రీ, అడ్వాన్స్ తమిళ్, హోం సైన్స్, స్టాటిస్టిక్ తదితర పాఠ్య విభాగాలు, 11వ తేది కెమిస్ట్రీ, అకౌంటెన్సీ, జాగ్రఫీ, 15వ తేది ఫిజిక్స్, కంప్యూటర్ టెక్నాలజీ, 19వ తేది గణితం, జువాలజీ, కామర్స్, 22వ తేది బయాలజీ, బోటనీ, హిస్టరీ పరీక్షలు జరగనున్నాయి. ఒక్కో పరీక్షకు 4 రోజుల విరామం ఉంటుంది. ప్రశ్నపత్రాలు ఉంచిన గదులు వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటైంది.

ఘనంగా హోటళ్ల సంఘ వార్షికోత్సవం



ప్రసంగిస్తున్న సంఘ అధ్యక్షుడు డార్లింగ్ వెంకటసుబ్బు

వేలూరు, ఫిబ్రవరి 28: షోళింగర్ నగర హోటళ్ల సంఘం 14వ వార్షికోత్సవాలు సంఘ అధ్యక్షుడు డార్లింగ్ వెంకటసుబ్బు నేతృత్వంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో తమిళనాడు హోటళ్ల సంఘ సెక్రటరీ శ్రీనివాసన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటకృష్ణన్, షోళిం గర్ నగర హోటళ్ల సంఘం గౌర వాధ్యక్షుడు నాగరాజ్, అధ్యక్షుడు ఆదిమూలం, సెక్రటరీ వెంకటేశులు, కోశాధికారి ముడిఅరసు, ఉపాధ్యక్షుడు పాండ్యన్, షోళింగర్ నగర మండ్ర అధ్యక్షుడు తమిళ్‌సెల్వి అశోకన్, షోళింగర్ నగర కమిషనర్ కన్నయప్పన్, రాణిపేట జిల్లా అధ్యక్షుడు పద్మనాభన్, వేలూరు జిల్లా అధ్యక్షుడు రామకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

డీఎంకే గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నందకుమార్

వేలూరు, ఫిబ్రవరి 28: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో డీఎంకే కూటమి అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ ఆనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్ పిలుపునిచ్చారు. ఆనైకట్టు నియోజకవర్గ డీఎంకే కార్యకర్తల సమావేశం బుధవారం జరిగింది. వేలూరు జిల్లా పంచాయతీ కమిటీ పథక కమిటీ అధ్యక్షుడు, ఆనైకట్టు వెస్ట్ యూనియన్ సెక్రటరీ బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీఎంకే మూడేళ్ల పాలనలో చేపట్టిన, అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేసి ఓట్లు అడగాలని దిశా నిర్దేశం చేశారు. జిల్లా యువజన విభాగం ఆర్గనైజర్ ప్రకాశ్, యూనియన్ నిర్వాహకులు గజేంద్రన్, గణపతి, హరి, గోవిందస్వామి, భాస్కర్, బెడుగత్తూర్ పంచాయతి సెక్రటరీ పెరుమాళ్ రాజ, యూనియన్, పంచాయతీ, శాఖల నాయకులు పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ ఆందోళన



ఆందోళనలో కాంగ్రెస్ శ్రేణులు


వేలూరు, ఫిబ్రవరి 28: స్థానిక కాంగ్రెస్ కార్యాలయం నుంచి పార్టీ శ్రేణులు బుధవా రం నల్లజెండాలతో ర్యాలీ నిర్వహించేందుకు యత్నిం చగా పోలీసులు అడ్డుకున్నా రు. నల్లజెండాలు తీసుకెళ్లరాదని పోలీసుల హెచ్చరికలతో, పార్టీ శ్రేణులు పార్టీ జెండాలు చేతబట్టుకొని ర్యాలీగా అన్నా ఆడిటోరియం వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు.జిల్లా అధ్యక్షుడు టీకా రామన్ అధ్యక్షతన జరిగిన ఆందోళనల్లో... రాష్ట్ర జాలర్లను శ్రీలంక నావికాదళం అమానుషంగా అరెస్ట్ చేస్తోందని, శ్రీలంక ఆగడాలను అడ్డుకొనేలా చర్యలు చేపట్టని బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం తీరును నిరసిస్తూ ఆందోళన చేపట్టినట్లు నేతలు తెలిపారు. ఆందోళనలో కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ శాఖ రాష్ట్ర కార్యదర్శి చిత్తరంజన్ సహా పలువురు నేతలు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంటీసీకి 1,042 కొత్త బస్సులు

● రాష్ట్ర ప్రభుత్వ రవాణా శాఖ

ప్యారీస్, ఫిబ్రవరి 28: చెన్నై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ)కు 1,042 కొత్త బస్సులను కొనుగోలు చేయనున్నట్లు రాష్ట్రప్రభుత్వ రవాణా శాఖ ప్రకటించింది. రవాణా శాఖ మంత్రి శివశంకర్ ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో 2024 సంవత్సరంలో ప్రభుత్వ రవాణా సంస్థల తరపున నడుపుతున్న పాత బస్సులు తొలగించి వాటి స్థానంలో కొత్తవి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసిందని తెలిపారు. ఆ మేరకు ఎంటీసీ సంస్థకు మొత్తం 4,200 కొత్త బస్సులు కొనుగోలు చేసేందుకు నిర్ణయించారు. తొలివిడతగా 200 ఏసీ బస్సులతో పాటు 1,042 కొత్త బస్సులు కొనుగోలు చేయనున్నారు. జర్మన్ బ్యాంక్ నిధుల నుంచి ఏసీ ఎలక్ట్రిక్ వసతితో మరో 100 బస్సులు కొనుగోలు చేసి ఎస్ఈటీసీకి అప్పగించనున్నట్లు ప్రకటించారు. దీనిపై బుధవారం ప్రభుత్వ రవాణా శాఖ అధికారులు మాట్లాడుతూ... కొత్త బస్సుల కొనుగోలుకు సంబంధించిన టెండర్లు ఆహ్వానించామన్నారు. అయితే బస్సుల కొనుగోలు, మరమ్మతులను అర్హత పొందిన ప్రైవేటు సంస్థకు అప్పగించడం ద్వారా ప్రభుత్వ పెట్టుబడి తగ్గుతుందన్నారు. ఇందుకు కొన్ని కార్మికుల సంఘాలు అభ్యంతరం తెలిపాయని, అయినప్పటికీ ఈ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం నీలి రంగుతో కూడిన 400 ఆర్డినరీ బస్సు సేవలను ఈ వారంలో సీఎం స్టాలిన్ ప్రారంభిస్తారని తెలిపారు. కాగా, కొత్త బస్సుల కొనుగోలుపై తమిళనాడు స్టేట్ ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ కార్మికుల సంఘ కార్యదర్శి కె.అన్బళగన్ మాట్లాడుతూ... కేంద్రప్రభుత్వ నిబంధన మేరకు డొక్కు బస్సులు వెంటనే తొలిగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ అయ్యాయని తెలిపారు. ప్రస్తుతం రాజధాని నగరంలో మాత్రం 6,000 బస్సులు అవసరమని, అయితే ప్రస్తుతం 3,300 బస్సులు మాత్రమే నడుపుతున్నందు వల్ల పీక్ అవర్స్‌ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

సముద్ర తీరంలో విద్యార్థి గల్లంతు



గల్లంతైన ధనుష్ (ఫైల్ ఫొటో)

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విహారయాత్ర కోసం వచ్చిన తిరుపతి జిల్లా చంద్రగిరిలోని ఓ ప్రైవేటు కళాశాలకు చెందిన డిప్లొమా విద్యార్థి చెంగల్పట్టు జిల్లా తందిరాయన్‌కుప్పం సముద్రతీరంలో గల్లంతయ్యాడు. వివరాలిలా ఉన్నాయి... కళాశాలకు చెందిన 19 మంది విద్యార్థులు పుదుచ్చేరి యాత్రకు బయలుదేరినట్లు తెలిసింది. అయితే మార్గమధ్యంలో వారు తందిరాయన్‌కుప్పం వద్ద సముద్ర స్నానం చేసేందుకు వెళ్లారు. అయితే అక్కడ ధనుష్ అనే విద్యార్థి సముద్రం లోపలికి వెళ్లాడు. ఆ సమయంలో రాక్షస అలు వచ్చి అతను నీటిలోకి కొట్టుకుపోయాడు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కోటకుప్పం పోలీసులు కేసు నమోదు చేసుకుని.. ఆ విద్యార్థి కోసం గాలిస్తున్నారు.

సెంథిల్ బాలాజీకి మళ్లీ నిరాశ

● బెయిలు పిటిషన్ తోసిపుచ్చిన హైకోర్టు

పెరంబూర్, ఫిబ్రవరి 28: సెంథిల్ బాలాజీ బెయిలు పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చింది. అలాగే, కేసు విచారణ మూడు నెలల్లో పూర్తి చేయాలని న్యాయమూర్తి ఎన్.ఆనంద్ వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. చట్టవ్యతిరేక నగదు బదిలీ నిరోధక చట్టం కింద నమోదైన కేసులో మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ గత ఏడాది జూన్‌లో అరెస్టయ్యారు. ఈ కేసులో బెయిలు కోరుతూ దాఖలైన పిటిషన్‌ను ఇదివరకే హైకోర్టు తోసిపుచ్చింది. ఈ నేపథ్యంలో, రెండో సారి ఆయన తరపున దాఖలైన బెయిలు పిటిషన్‌ను న్యాయమూర్తి ఎన్.ఆనంద్ వెంకటేష్ విచారించారు. ఈ కేసులో అన్ని తరపున వాదనలు విన్న న్యాయమూర్తి, బెయిలు పిటిషన్‌పై తీర్పు తేది ప్రకటించ కుండా గత వారం వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో, సోమవారం తీర్పు వెలువరించిన న్యాయమూర్తి బెయిలు పిటిషన్ తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీ చేశారు. 8 నెలలుగా జైల్లో ఉన్నానంటూ బెయిలు కోరడాన్ని అంగీకరిం చలేమని పిటిషన్ తిరస్కరించారు. అలాగే, ఈ కేసు మూడు నెలల్లో పూర్తి చేయాలని న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసును రోజువారీగా విచారించాలని న్యాయమూర్తి పేర్కొన్నారు.

రైతు సంక్షేమం పట్టని డీఎంకే ప్రభుత్వం

● అన్నాడీఎంకే బహిష్కృత నేత శశికళ

ప్యారీస్, ఫిబ్రవరి 28: ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్న రాష్ట్ర రైతులను కాపాడేందుకు డీఎంకే ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నాలు చేపట్టలేదని అన్నాడీఎంకే బహిష్కృత నేత వీకే శశికళ వ్యాఖ్యానించారు. ఆమె నగరంలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ... వేసవి సీజన్ ప్రారంభానికి ముందే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నీటి కొరత తలెత్తిందన్నారు. తాగునీటికి ప్రజలు, సాగునీటికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారని, అయితే ఎన్నికల హామీలన్నింటినీ నెరవేర్చామని ప్రకటిస్తున్న డీఎంకే... నీటి సమస్య గురించి పట్టించుకోలేదని విమర్శించారు. పొరుగునే ఉన్న ఆంధ్రప్రభుత్వం పాలారు నదికి అడ్డుగా చెక్‌డ్యాం నిర్మించేందుకు రూ.215 కోట్లు కేటాయించిందని, ఇప్పటికే పాలారుకు అడ్డుగా 22 చెక్‌డ్యాంలు నిర్మించారని, ఈ పరిస్థితుల్లో కొత్తగా మరో చెక్‌డ్యాంను కుప్పం లో నిర్మించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టడం ఆవేదన కలిగిస్తుందని తెలిపారు. ఈ చెక్‌డ్యాం అందుబాటులోకి వస్తే వేలూరు, కాంచీపురం, విల్లుపురం, తిరువణ్ణామలై జిల్లాలకు చెందిన రైతులు సాగునీటి కోసం ఇబ్బంది పడతారన్నారు. రాష్ట్రప్రజలు కోల్పోతున్న హక్కులు కాపాడేందుకు ఎలాంటి చర్యలు చేపట్టని డీఎంకే ప్రభుత్వం, లోక్‌సభ ఎన్నికలపై మాత్రమే దృష్టి సారించిందని శశికళ ఎద్దేవా చేశారు.

17 మంది డీఎస్పీల బదిలీ

అడయార్, ఫిబ్రవరి 28: రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల నిబంధనల మేరకు 17 మంది డీఎస్పీను బదిలీ చేశారు. ఇదే విషయంపై రాష్ట్ర డీజీపీ శంకర్ జివాల్ బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. బదిలీ చేసిన వారిలో తేని జిల్లా పెరియకుళం డీఎస్పీ నల్లు, తిరువణ్ణామలై జిల్లా పోలూరు డీఎస్పీ, చెన్నై పెరవళ్లూరు అసిస్టెంట్ కమిషనర్ పరమానందం, తిరుమంగళం అసిస్టెంట్ కమిషనర్ వరదరాజన్‌తో పాటు మరికొందరు డీఎస్పీలు ఉన్నారు.

సీట్ల పంపిణీపై స్టాలిన్ చర్చలు

అడయార్, ఫిబ్రవరి 28: లోక్‌సభ ఎన్నికల్లో కూటమిలోని పార్టీలకు సీట్ల పంపిణీపై పార్టీ సీనియర్ నేతలతో డీఎంకే అధినేత, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆకస్మికంగా సమావేశమై చర్చించారు. డీఎంకే కూటమి పార్టీలకు సీట్లకు కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేసి, పంపిణీని త్వరగా పూర్తి చేయాలని కమిటీకి సూచించారు. స్థానిక తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయమైన అన్నా అరివాలయంలో ఈ సమావేశం జరిగింది. ఆకస్మికంగా జరిగిన ఈ సమావేశంలో అందుబాటులో ఉన్న సీనియర్ నేతలతో సీట్ల పంపిణీ కోసం ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి తరలింపు కేసులో ఒకరికి యావజ్జీవం

పెరంబూర్, ఫిబ్రవరి 28: గంజాయి తరలింపు కేసులో ఇద్దరికి యావజ్జీవ శిక్ష విధిస్తూ విల్లుపురం జిల్లా కోర్టు తీర్పు వెలువరించింది. 2020లో విక్కిరవాండి చెక్‌పోస్ట్ వద్ద ఆంధ్ర నుంచి మదురైకి తరలిస్తున్న 120 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని, మదురైకి చెందిన మురు గానందం, ప్రభాకరన్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో మురుగానందంకు రెండు యావజ్జీవ శిక్షలు, రూ.2 లక్షల జరిమానా, ప్రభాకరన్‌కు మూడేళ్ల జైలు, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ విల్లుపురం జిల్లా కోర్టు బుధవారం తీర్పు వెలువరించింది.

పొలంలో చెలరేగిన మంటలు రైతు సజీవ దహనం

పెరంబూర్, ఫిబ్రవరి 28: రామనాథపురం జిల్లా తిరువాడనై సమీపంలో పొలంలో ఉన్న చెత్తను తగులబెడుతున్న సమయంలో ఆ మంటల్లో చిక్కుకొని రైతు సజీవ దహనమయ్యాడు. చెత్తలో భారీగా చెలరేగిన మంటలు చూసి కాళిముత్తు (87) స్పృహతప్పి ఆ మంటల్లో పడి మృతి చెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో తాత, మనవడి మృతి

పెరంబూర్, ఫిబ్రవరి 28: ఊటీకి విహారయాత్రకు వెళ్లిన తాత, మనవడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వేలూరు జిల్లా కాట్పాడి సెంగోట్టై ప్రాంతానికి చెందిన కమాదీన్ (65), ఆయన భార్య సుభైత (62), మనవరాలు ఆసికా(13), మనవడు అబుదాగీర్ (9)తో కలసి కారులో ఊటీకి వెళ్లారు. కారును అదే ప్రాంతానికి చెందిన నవాజ్ నడిపాడు. భవానీ సమీపంలో బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు వెళ్తున్న కారు హఠాత్తుగా అదుపుతప్పి ముందు వెళ్తున్న కంటైనర్ లారీని ఢీకొంది. ఈ ఘటనలో కారు ముందు భాగంలో కూర్చున్న కమాదీన్ సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, డ్రైవర్ నవాజ్, అబుదాగీర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ క్రమంలో, ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అబుదాగీర్ మృతిచెందాడు. ఈ ఘటనపై సిత్తోడు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

14న వాహనాల వేలం

పెరంబూర్, ఫిబ్రవరి 28: కేసుల్లో చిక్కుకొని ఎవరూ తీసుకెళ్లని, పాత వాహనాలను మార్చి 14వ తేది వేలం వేయనున్నట్లు గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ ప్రకటనలో తెలిపింది. 661 ద్విచక్రవాహనాలు, 17 మూడు చక్రాల వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలు నాలుగు అని మొత్తం 682 వాహనాలు వేలం వేయనున్నారు. ఆసక్తి కలిగిన వారు పుదుపేటలోని ఆర్మ్డు రిజర్వ్ మైదానంలో మార్చి 7, 8 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వాహనాలు పరిశీలించవచ్చు. జీఎస్‌టీ నెంబరుతో పేరు, అడ్వాన్స్ రుసుము నమోదు చేసుకొని 14వ తేది ఉదయం 10 గంటలకు జరుగనున్న వేలంలో పాల్గొనవచ్చని పోలీసు శాఖ తెలియజేసింది.



అరుంబాక్కం డీజీ వైష్ణవి కళాశాలలో అంతర్జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థినులు

రేపటినుంచి ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు

పెరంబూర్, ఫిబ్రవరి28:రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత, మహోన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్యా నాణ్యత పెంచేలా 'ఇల్లం తేడి కల్వి', 'ఎన్నుమ్ ఎళుత్తుమ్', 'నాన్ ముదల్‌వన్' పథకాలతో పాటు మార్షల్ ఆర్ట్స్ శిక్షణ, విద్యా విహారయాత్రలు అమలుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో, 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు మార్చి 1వతేదినుంచి చేపట్టాలని పాఠశాలవిద్యాశాఖ ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు జారీ చేసింది. ఐదేళ్లు పూర్తయిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులను సంప్రదించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ప్రధానోపాధ్యాయులు, విద్యాధికారులు చర్యలు చేపట్టాలి. ప్రతి జిల్లాలో కలెక్టర్ నేతృత్వంలో సమావేశం నిర్వహించి, అందులో స్థానిక ప్రజా ప్రతినిధులు, పురప్రముఖులను ఆహ్వానించి విద్యార్థుల అడ్మిషన్లు పెంచేలా చర్యలు చేపట్టాలి. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్యను ప్రజలు తెలుసుకొనేలా బ్యానర్లు ఏర్పాటు చేయడమేకాకుండా తల్లిదండ్రులకు కరపత్రాలు అందజేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కల్పిస్తున్న వసతులు, సంక్షేమ సహాయాలు, ఉదయం అల్పాహారం తదితరాలపై అవగాహన ర్యాలీ చేపట్టాలి. అలాగే, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు లభించే ప్రాధాన్యం గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. పాఠశాల చుట్టుపక్కలనున్న ప్రాంతాల్లో 5 ఐదేళ్లు నిండిన పిల్లలను గుర్తించి, వారి ఇంటికి నేరుగా వెళ్లి తల్లిదండ్రులను సంప్రదించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

చిత్రజ్యోతి

'ఇంగ నాన్‌దాన్ కింగు' అంటున్న

హీరో సంతానం

తాజాగా 'వడకంపట్టి రామస్వామి' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత కమెడియన్ కమ్ హీరో సంతానం.. 'ఇంగ నాన్‌దాన్ కింగు'తో ప్రేక్షకుల ముందుకురానున్నారు. బడా నిర్మాత, సినీ ఫైనాన్షియర్ జీఎన్ అన్బుచెళియన్ సమర్పణలో గోపురం ఫిలిమ్స్ బ్యానరుపై నిర్మాత సుష్మిత అన్బుచెళియన్ నిర్మిస్తున్నారు. ఆనంద్ నారాయణ్ దర్శకత్వం వహించగా, డి.ఇమ్మాన్ సంగీతం సమకూర్చుతున్నారు. ఈ సినిమా టైటిల్‌తోపాటు ఫస్ట్‌లుక్‌ను 'విశ్వనటుడు' కమల హాసన్ బుధవారం రిలీజ్ చేశారు. అన్ని వర్గాల ప్రేక్షకులు ఎంజాయ్ చేసేలా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ప్రియలయ హీరోయిన్‌గా నటించారు. ఇతర పాత్రల్లో తంబి రామయ్య, మునీష్‌కాంత్, వివేక్ ప్రసన్న, బాలా శరవణన్, మారన్, కూల్ సురేష్ తదితరులు నటించారు. ప్రముఖ రచయిత అరవిందన్ ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు అందించారు. విఘ్నేష్ శివన్, ముత్తమిళ్ పాటలు రాశారు. చెన్నై, పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంది. ప్రస్తుతం చివరి దశ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వేసవి సెలవుల్లో ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించడానికి ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.


'ఇంగ నాన్‌దాన్ కింగు' ఫస్ట్‌లుక్

యువతరం సమస్యల ఇతివృత్తంతో...

● 8న 'నల్ల పేరై వాంగ వేండుం పిల్లైగలే'

యువతరం ఎదుర్కొంటున్న సవాళ్లు, వారిపట్ల సమాజ వైఖరి తదితర అంశాలను ఇతివృత్తంగా తీసుకుని సందేశాత్మక చిత్రంగా 'నల్ల పేరై వాంగ వేండుం పిల్లైగలే' తెరకెక్కింది. మార్చి 8న విడుదలకానుంది. 'అరుణగిరి పెరుమాలే' అనే డాక్యుమెంటరీతో గుర్తింపుపొందిన ప్రసాద్‌రామర్ దర్శకత్వంలో సంగీత దర్శకుడు ప్రదీప్‌కుమార్ నిర్మించిన ఈ చిత్రంలో సెంధూర్ పాండియన్, ప్రీతి కరణ్ జంటగా నటించగా, సురేష్ మదియళగన్, తమిళ్ సెల్వి, పూర్ణిమ రవి ఇతర పాత్రలను పోషించారు. ఇప్పటికే సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం 'ఏ' సర్టిఫికెట్ పొందింది. కెమెరా ఉదయ్ తంగవేల్, సంగీతం ప్రదీప్‌కుమార్. ఈ చిత్ర వివరాలను నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిత్ర బృందం వివరించింది.


'నల్ల పేరై వాంగ వేండుం పిల్లైగలే' ఓ దృశ్యం

'2019లో చిత్రీకరణ ప్రారంభించినప్పటికీ కరోనాతో పాటు వివిధ కారణాలతో చిత్రీకరణ ఆలస్యమైంది. చిన్న పట్టణంలో యువకుల జీవితాల నేపథ్యంలో రోడ్ జర్నీగా స్క్రీన్‌ప్లే సాగుతుంది. ఇద్దరు యువకులు మదురై నుంచి మాయావరానికి బయలుదేరుతారు. మార్గమధ్యంలో వారికి ఒక అమ్మాయి తోడవుతుంది. ఆ తర్వాత ఏం జరిగిందన్నదే ఈ చిత్ర కథ. యూత్ మూవీ కావడంతో శృంగారం పాళ్లు అధికంగా ఉన్నాయి. అందుకే సెన్సార్ కమిటీ ఏ సర్టిఫికేట్ మంజూరు చేసింది. ఇక సినిమాను 42 రోజుల పాటు మదురై, మాయావరంలలో చిత్రీకరించాం. ప్రీతికరణ్ ఒక మోడల్. ఇందులో పక్కా గ్రామీణ యువతిగా నటించారు. హీరోకు ఎలాంటి అనుభవం లేదు. తొలి షెడ్యూల్ పూర్తయ్యేంత వరకు నిజంగానే సినిమా తీస్తున్నారా? అనే భావన ఉండేది. ప్రతి పాత్ర సహజసిద్ధంగా కనిపిస్తుంది. తక్కువ బడ్జెట్‌లో నిర్మాణం పూర్తి చేశాం' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

విజయ్‌కుమార్ హీరోగా 'ఎలక్షన్'

'ఉరియడి', 'ఫైట్‌క్లబ్' వంటి చిత్రాల ద్వారా అభిమానులను సంపాదించుకున్న నటుడు విజయ్‌కుమార్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఎలక్షన్'. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను తాజాగా విడుదల చేశారు. ఇందులో విజయ్‌కుమార్ రూపురేఖలు విభిన్నంగా ఉండటంతో అభిమానుల నుంచి మంచి స్పందన వస్తోంది. 'సేతుమాన్' ఫేం తమిళ్ ఈ చిత్రానికి దర్శకుడు. 'అయోధి' ఫేం ప్రీతి అస్రాణి హీరోయిన్. రిచ్చా జోషి, దిలీపన్, పావెల్ నవగీతన్, జార్జ్ మరియం, నాచ్చియాళ్ సుగంధి తదితరులు ఇతర పాత్రల్లో నటించారు. మహేంద్రన్ జయరాజు ఛాయాగ్రహణం సమకూర్చిన ఈ చిత్రానికి గోవింద్ వసంత్ సంగీతం అందించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం చివరి దశ నిర్మాణ పనులు జరుపుకుంటోంది. త్వరలోనే టీజర్, సింగిల్ ట్రాక్, లిరికల్ వీడియో, ట్రైలర్లను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.


'ఎలక్షన్' ఫస్ట్‌లుక్

ఎట్టైనా వెళ్లిపోవాలనిపిస్తోంది

● దర్శకుడు గౌతం మీనన్

విక్రమ్ హీరోగా స్పై థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'ధృవనక్షత్రం' చిత్రం విడుదలలో నెలకొన్న జాప్యంపై ఆ చిత్ర దర్శకుడు గౌతం మీనన్ తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఎటైనా వెళ్లి పోవాలనిపిస్తుందంటూ వాపోయారు. 2016లో పట్టాలెక్కిన ఈ ప్రాజెక్టును పూర్తి చేసి 2017లో విడుదల చేయాలని భావించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. గత యేడాది డిసెంబరులో రిలీజ్‌కు ప్లాన్ చేసినప్పటికీ చివరి నిమిషంలో వాయిదాపడింది. ఈ పరిస్థితుల్లో తాజాగా ఆయన దర్శకత్వం వహించిన 'జోషువ' చిత్రం విడుదలకు సిద్ధమైంది. కానీ, 'ధృవనక్షత్రం' విడుదలలో జరుగుతున్న జాప్యంపై ఆయన అసహనం వ్యక్తం చేస్తున్నారు. 'ఇది చాలా హృదయ విదారకంగా ఉంది. చిత్రం వాయిదా విషయంలో ఎన్నో రోజులుగా మనశ్శాంతి లేదు. నా కుటుంబం ఆందోళన చెందుతోంది. నా భార్య నెల రోజులుగా ఈ విషయాన్నే ఆలోచిస్తోంది. కానీ, పెట్టుబడిదారులకు సమాధానం చెప్పాలని ఉంటున్నా. 'జోషువా'కు ముందు 'ధృవనక్షత్రం' సినిమాను విడుదల చేయాలని భావించా. కానీ వీలుపడలేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు.



ఘనంగా పక్వాన్ చెన్నై అవార్డుల ప్రదానోత్సవం

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక టినగర్‌లోని ప్రముఖ హోటల్‌లో పక్వాన్ చెన్నై అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన మహిళా ప్రముఖులకు సంస్థ నిర్వాహకులు సంజయ్‌డాంగి, అనిల్‌డాంగి, హితేష్ కొఠారి అవార్డులను ప్రదానం చేసి సత్కరించారు. ముఖ్య అతిథిగా మలేసియా రాయబారి శరవణకుమార్ కుమారవాసగం పాల్గొన్నారు. ప్రముఖ ఆర్కిటెక్ట్‌కు ప్రత్యేక అవార్డు, ప్రఖ్యాతనటి సచ్చుకు జీవితకాల సాఫల్యపురస్కారం, మరో నటి సుహాసిని మణిరత్నంకు దాతృత్వ సేవలకుగాను ప్రత్యేక అవార్డు, ప్రముఖ నేపథ్య గాయని అనురాధ శ్రీరామ్ ఉత్తమ నేపథ్య గాయని అవార్డు ప్రదానం చేశారు. ఈ సంస్థ ప్రకటించిన అవార్డు గ్రహీతల జాబితాలో డాక్టర్ రెజినీ జే మురళి (విద్యావేత్త), డాక్టర్ వేద పద్మప్రియ (సర్జికల్ ఆంకాలజిస్ట్, ఎంజీఎం హాస్పిటల్స్), గీతా ఏటీ (ఛార్టెడ్ అకౌంటెంట్), సవితా రాధాకృష్ణన్ (వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్), కలైమామణి పద్మాశంకర్ (వాయిద్య కళాకారిణి), ప్రియా మణికంఠన్ (ఫ్యాషన్ కొరియోగ్రాఫర్), యోగితా ఉచిల్ (ఫుడ్ క్రిటిక్) తదితరులున్నారు.


సినీనటి సుహాసిని మణిరత్నం నుంచి అవార్డును స్వీకరిస్తున్న ప్రముఖ ఆర్కిటెక్ట్ హర్షితరెడ్డి


కోనియమ్మన్ ఆలయ రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవం... కోవై కోనియమ్మన్ ఆలయ రథోత్సవం

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వాణిజ్యనగరం కోయంబత్తూరు టౌన్‌హాలు ప్రాంతంలోని సుప్రసిద్ధ కోనియమ్మన్ ఆలయ రథోత్సవం బుధవారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆలయంలో యేటా మాసి నెలలో రథోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు ఈనెల 20న ఆలయంలో ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, వివిధ రకాల వాహన సేవలు నిర్వహించారు. మంగళవారం వేకువజాము 5 గంటలకు మూలవిరాట్టుకు అభిషేకం, సాయంత్రం 4.30 గంటలకు ఉత్సవమూర్తికి అభిషేకం, రాత్రి 7గంటలకు తిరుకల్యాణోత్సవం, అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో అత్యంత కీలక ఘట్టమైన రథోత్సవం బుధవారం మధ్యాహ్నం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా పేరూరు ఆధీనం శాంతలింగ మరుదాచలం అడిగళార్, కౌమార మఠాలయం శిరవై ఆధీనం కుమారగురుబర స్వామి, కోయంబత్తూరు కామాక్షిపురం ఆధీనం శివలింగేశ్వర స్వామి, స్థానిక భక్తులతో కలిసి రథం ఇరువైపులా మోకుతాళ్లను పట్టుకుని లాగుతూ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ రథోత్సవంలో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు, దాతలు పలు చోట్ల అన్నదానం చేశారు.

అట్టహాసంగా ఆరోవిల్ ఆవిర్భావ దినోత్సవం


ఆరోవిల్ నగరంలో సామూహిక ధ్యానంలో పాల్గొన్న భక్తులు, స్థానికులు

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి సమీపం విల్లుపురం జిల్లాలోని ఆరోవిల్ అంతర్జాతీయ నగరం ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. మహా పురుషుడు అరవింద సంకల్పం మేరకు ఆయన ప్రథమ శిష్యురాలైన మాత 1968 ఫిబ్రవరి 28న ఆరోవిల్ అంతర్జాతీయ నగర నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి యేటా ఆరోవిల్ ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆ మేరకు ఆరోవిల్ నగర 57వ ఆవిర్భావ దిన వేడుకలను పురస్కరించుకుని బుధవారం వేకువ జామున ఆరోవిల్ ఆంఫీ థియేటర్ ప్రాంగణం వద్ద సామూహిక ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. విశ్వశాంతిని కాంక్షిస్తూ జరిగిన ఈ సామూహిక ధ్యానంలో వేలాదిమంది విదేశీలయులు, స్థానికులు పాల్గొన్నారు. ఈ ధ్యానంలో ఏర్పాటైన యాగగుండం నుంచిఎగసిన నిప్పుమంటల వెలుగులో మాత్రీ మందిర్ స్వర్ణకాంతులతో ధగధగా మెరియడంతో భక్తులు ఆ మందిరం దిశగా నమస్కరిస్తూ తన్మయం చెందారు.

7 వేల ఏళ్లనాటి అస్తిపంజరం లభ్యం



ఐసిఎఫ్, ఫిబ్రవరి 28: చెంగల్పట్టు సమీపం పాలారులో చేపట్టిన తవ్వకాల్లో 7 వేల ఏళ్లనాటి మానవ అస్తిపంజరం బయల్పడింది. మద్రాసు విశ్వవిద్యాలయ ప్రాచీన చరిత్ర, పురావస్తు శాఖ పరిశోధకుల బృందం చెంగల్పట్టు జిల్లా పటాలం సమీపంలోని చెట్టిమేడు పాతూర్‌లో కొన్నేళ్ల క్రితం పరిశోధనలు చేపట్టింది. కొత్త రాతియుగం నాటి పరికరాలు, కుండ పెంకులు వంటి వాటిని గుర్తించారు. అనంతరం ఆ ప్రాంతంలో తవ్వకాలు చేపట్టేందుకు భారత పురావస్తు శాఖ అనుమతి పొందారు. ఆర్సీ చర్చి ప్రాంగణంలో ఈనెల 5వ తేదీ తవ్వకాలు చేపట్టారు. తలా 2 మీటర్ల లోతులో నాలుగు గుంతలు తవ్వగా ఒక గోతిలో 7 వేల ఏళ్లకు ముందు ఖననం చేసిన రాతియుగానికి చెందిన మానవ అస్తిపంజరం బయల్పడింది. ఈ విషయమై పరిశోధకులు మాట్లాడుతూ... రెండు మీటర్ల లోతులో చేపట్టిన తవ్వకాల్లో 9 నుంచి 11 ఏళ్లలోపున్న మానవ అస్తిపంజరం లభించిందని, ఇది ఆడా, మగా అని తెలియలేదని, పరిశోధనల అనంతరం వివరాలు వెల్లడిస్తామన్నారు. అలాగే, ఎరుపు, నలుపు రంగు మట్టిపెంకులు, ఇటుకలు, చోళుల కాలం నాటి నాణేలు లభించాయన్నారు.

బీజేపీలో చేరతానని చెబితే చెప్పుతో కొడతా

● కాంగ్రెస్ ఎంపీ తిరునావుక్కరసు


మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ ఎస్ తిరునావుక్కరసర్

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నుంచి వైదొలగి బీజేపీలో చేరుతున్నట్లు తనపట్ల దుష్ప్రచారం చేసేవారిని చెప్పుతో కొడతానంటూ ఆ పార్టీ ఎంపీ ఎస్ తిరునావుక్కరసు మండిపడ్డారు. తిరుచ్చిలో బుధవారం మధ్యాహ్నం ఆయన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విజయధరణి బాటలోనే మీరు కూడా బీజేపీలో చేరుతున్నట్లు వదంతులు వ్యాపిస్తున్నాయి కదా అని విలేకరులు ప్రశ్నించగా... ఆ విషయం చెప్పే వ్యక్తి తన ఎదుటకు వస్తే చెప్పుతో కొడతానని, ఇకపై శీమాన్‌లాగే మాట్లాడాలని నిర్ణయించుకున్నానని మండిపడ్డారు. అన్నాడీఎంకేని ఎన్డీయేలో చేర్చుకునేందుకే మోదీ తన ప్రసంగాలలో ఎంజీఆర్, జయపై పొగడ్తల వర్షం కురిపిస్తున్నారని ఆయన విమర్శించారు.

బెస్ట్ కామెడీని తలపించిన ప్రధాని ప్రసంగం

కాంగ్రెస్ నాయకుడు రంజన్ కుమార్ ఎద్దేవా

అడయార్, ఫిబ్రవరి 28: రెండు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రసంగాలు బెస్ట్ కామెడీని తలపించాయని టీఎన్‌సీసీ ఎస్సీ, ఎస్టీ విభాగ అధ్యక్షుడు రంజన్ కుమార్ విమర్శించారు. ప్రధాని రాష్ట్ర పర్యటనను వ్యతిరేకిస్తూ నల్ల జెండాలతో నిరసన తెలిపేందుకు రంజన్ కుమార్ పిలుపునిచ్చారు. దీంతో పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా రంజన్‌కుమార్‌ను రెండు రోజులుగా గృహ నిర్బంధంలో ఉంచారు. ఇదే విషయంపై ఆయన బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలోని ఏ ఒక్క పార్టీకి పోటీ కాదన్నారు. నోటాతో బీజేపీ పోటీ పడుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో నోటాకు మించి ఓట్లు సాధించి చూపాలని, ఆ తర్వాత ఇండియా కూటమిపై విమర్శలు చేయాలని రంజన్ కుమార్ పేర్కొన్నారు.

హెచ్‌ఐటీలో వరి సాగుపై వర్క్‌షాపు

అడయార్, ఫిబ్రవరి 28: నగరంలోని ప్రముఖ విద్యా సంస్థల్లో ఒకటైన హిందుస్థాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి క్రిషి సించియే యోజన (పీఎంకేఎస్‌వై) పేరుతో వరి సాగుపై వర్క్‌షాపును నిర్వహించారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ ప్రాజెక్టు నిధుల భాగస్వామ్యంతో దీన్ని ఏర్పాటు చేశారు. హెచ్‌ఐటీలోని ఎకనామిక్స్ విభాగం, స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ నేతృత్వంలో జరిగిన ఈ వర్క్‌షాపులో పరిశోధన సంస్థల పరిశోధకులు, రైతులు, తమిళనాడు, ఏపీ, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన సమన్వయకర్తలు, విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వర్క్‌షాపులో విశిష్ట వక్తలుగా గాంధీగ్రామ్ రూరల్ యూనివర్శిటీ నుంచి ప్రొఫెసర్ ఎస్.రాజేంద్రన్, స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ నుంచి డాక్టర్ ఆర్.గోపీనాథ్, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ నుంచి ఎల్.మాయాకృష్ణన్ తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఇందులో డాక్టర్ ఆనంద్ జాకబ్ వర్గీస్ అధ్యక్షోపన్యాసం చేయగా, హెచ్‌ఐటీకి చెందిన ఆర్గనైజింగ్ సెక్రటరీ, ప్రాజెక్టు డైరెక్టర్, కోఆర్డినేటర్ డాక్టర్ శబరిశక్తి కీలక ప్రసంగం చేశారు. వ్యవసాయ పరిశోధనలను ముందుకు తీసుకెళ్లడంలో విశ్వవిద్యాలయం కృషిని ఆయన వివరించారు.



వర్క్‌షాపులో ప్రముఖులు

ట్రేడ్ సెంటర్‌లో వాటర్ ఎక్స్‌పో ప్రారంభం

అడయార్, ఫిబ్రవరి 28: స్థానిక నందంబాక్కంలోని చెన్నై ట్రేడ్ సెంటర్‌లో 17వ ఎడిషన్ 'వాటర్ ఎక్స్‌పో 2024' బుధవారం ప్రారంభమైంది. ఈ ఎగ్జిబిషన్ మార్చి 1వ తేదీ వరకు జరగనుంది. వాటర్, వేస్ట్‌వాటర్ ఇండస్ట్రీ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై ఈ ఎక్స్‌పో జరగనుంది. ఈ ప్రదర్శనను ఆర్క్ ఎన్విరో ఎక్విప్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ అరుణ్ గుప్తా, ఇన్నోమోటిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో అలెక్స్ నజరత్, హెచ్‌ఈసీఎస్ డైరెక్టర్ సంగీత మోసెస్, తమిళనాడు బాటిల్ వాటర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రభాకర్, వాటర్ టుడే ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి ఎస్.షణ్ముగం తదితరులు పాల్గొన్నారు. ఈ వాటర్ ఎక్స్‌పోలో 200కు పైగా ఎగ్జిబిటర్లు, 8 వేల మంది సందర్శకులు, 10కిపైగా ఎగ్జిబిషన్ కౌంటర్లు, 6 వేల విస్తీర్ణంలో ఎగ్జిబిషన్ ఏరియా, 175కు పైగా విభాగాల్లో వివిధ టెక్నాలజీని వివరించే స్టాళ్లు, 100కు పైగా సదస్సు ప్రతినిధులు, 40 మంది కాన్ఫరెన్స్ స్పీకర్లు ఇలా విస్తృతమైన ఏర్పాట్లు చేశారు.



సీనియర్ నటుడు అడడే మనోహర్ కన్నుమూత


మనోహర్ (ఫైల్ ఫొటో)

ప్యారీస్, ఫిబ్రవరి 28: సీనియర్ నటుడు అడడే మనోహర్ (70) వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా మంగళవారం రాత్రి స్థానిక కుమరన్‌చావిడి ప్రాంతంలోని ఆయన నివాసంలో మరణించారు. సుమారు 75కు పైగా సినిమాల్లో, దూరదర్శన్, నాటకాల్లో నటించడంతో పాటు సంభాషణలు, పలు చిత్రాలకు కథలు కూడా రాశారు. మనోహర్ మృతికి సినీరంగానికి చెందిన పలువురు సంతాపం తెలిపారు. 1986లో ఆయన నటించి, దర్శకత్వం వహించిన 'అడడే మనోహర్' కామెడి సీరియల్ ఆయనకు ముద్దు పేరుగా నిలిచింది.

నేటి నుంచి వీఐటీలో 'రివేరా' ఆర్ట్ ఫెస్టివల్

● పాల్గొననున్న 40 వేలమంది విద్యార్థులు

వేలూరు, ఫిబ్రవరి 28: వేలూరు వీఐటీ యూనివర్శిటీలో యేటా నిర్వహించే 'రివేరా 24' ఆర్ట్ ఫెస్టివల్ ఈనెల 29న గురువారం ప్రారంభం కానుంది. నాలుగు రోజులు జరగనున్న ఈ సంబరాల్లో ఆసియా, యూరప్, ఆఫ్రికా, పోర్చుగల్, స్వీడన్, బెల్జియం, మొరాకో, కజకస్థాన్, కాంబోడియా, రుమేనియా, థాయ్‌ల్యాండ్, శ్రీలంక సహా 35 దేశాలకు చెందిన 135 యూనివర్శిటీల నుంచి సుమారు 40,000 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. తమిళం, తెలుగు, హిందీ తదితర భాషల్లో 55 కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది 'రివేరా 24'లో గోకార్టింగ్, బైక్ స్టంట్ షో, తార్లే రివేరా, పైన్‌బాల్ అరేనా, ఆనిమ్ ఆర్కేడ్, జీరో గ్రావిటీ డాన్స్ పార్టీ సహా కొత్త పోటీలు ఉండబోతున్నాయి. ఈ సందర్భంగా విజేతలకు సుమారు రూ.20 లక్షల నగదు బహుమతులు అందజేయనున్నారు. వేడుకల ప్రారంభోత్సవంలో భాగంగా నిర్వహించనున్న మారథాన్ పోటీలను ప్రముఖ క్రికెటర్ శివమ్‌దూబె ప్రారంభించనున్నారు. అలాగే, తొలిరోజు ప్రముఖ నేపథ్యగాయకులు విజయ్ ప్రకాష్, శంకర్ మహదేవన్ సంగీత కచేరి జరుగుతుంది. 2వ తేది ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ సంగీత కచేరి సహా ముర్రే మొలాయ్ అడ్వెంచర్ షో తదితరాలు ఉంటాయి. వేడుకల్లో నాల్గో రోజు ప్రముఖ సినీ నటి సమంత రుథ్ ప్రభు ప్రత్యేక అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు.

ఈరోడ్‌లో జౌళి వ్యాపారుల బంద్



ఈరోడ్‌లో మూతపడిన జౌళి దుకాణాలు

చెన్నై, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వాణిజ్యపరమైన రుణాలను త్వరితగతిన వసూలు చేయడానికి అనువుగా కేంద్రం ఐటీ చట్టం సెక్షన్ 43బి(హెచ్)ని సవరించడాన్ని వ్యతిరేకిస్తూ ఈరోడ్‌లో జౌళి వ్యాపారులు బంద్ పాటించారు. ఈ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని కోరుతూ బుధవారం ఉదయం జౌళి దుకాణాలన్నింటినీ మూసివేశారు. నిత్యం జనసమ్మర్థంగా కనిపించే తిరువెంకటసామి వీధి, ఈశ్వరన్ కోవిల్ వీధి, పన్నీర్‌సెల్వం పార్క్, టవర్‌క్లాక్ జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఐదువేలకు పైగా జౌళి దుకాణాలు మూతపడ్డాయి. ఈ ఆందోళనకు మద్దతు ప్రకటిస్తూ మరమగ్గాల యజమానులు సమ్మెలో పాల్గొన్నారు. ఈరోడ్ జిల్లాలోని ఈరోడ్, భవాని, చిత్తేడు, పీపీ అగ్రహారం, పళ్లిపాళయం తదితర ప్రాంతాల్లోన్ని సుమారు యాభైవేలకుపైగా మరమగ్గాలను మూతపడ్డాయి. ఉదయం 8నుంచి రాత్రి 8 గంటల వరకూ ఈ మరమగ్గాలలో దుస్తుల తయారీని నిలిపివేశారు.


బంద్‌కు మద్దతుగా మూతపడిన పవర్‌లూమ్ ఫ్యాక్టరీ